సాక్షి కుమురం భీం

గురువారం : 4 : మే : 2023



'అంగన్‌వాడీ'లకు సన్నబియ్యం

అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యం అందించనున్నారు. పూర్తిస్థాయిలో ఉత్తర్వులు వెలువడితే ఈ నెలలోనే సన్నబియ్యం సరఫరా చేసే అవకాశం ఉంది. 8లో▸



నర్సరీ.. రెండు ప్రయోజనాలు

నర్సరీల ఏర్పాటుతో రెండు రకాల ప్రయోజనాలు చేకూరుతున్నాయి. హరితహారం కార్యక్రమానికి మొక్కల పెంపకంతోపాటు కూలీలకు ఉపాధి లభిస్తోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.2/24.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. ఉదయం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వ్యాక్సినేషన్ కేంద్రం పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న సుధాకర్‌నాయక్

వాంకిడి(ఆసిఫాబాద్): మండలంలోని బెండార ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ కేంద్రాన్ని బుధవారం డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా సబ్‌సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు. వ్యాక్సినేషన్ సెషన్‌లో పాటిస్తున్న నియమ నిబంధనలపై ఆరా తీశారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట వాంకిడి వైద్యాధికారి ఉప్రె వినయ్, ఎంపీహెచ్‌ఈవోలు శ్యాంలాల్, రవిదాస్, సిబ్బంది ఉన్నారు.

10లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



సమావేశంలో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

ఆసిఫాబాద్: జిల్లాలోని విశ్రాంత ఉద్యోగులు ఈ నెల 10లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్నాగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాగజ్‌నగర్ యూనిట్‌లో 67 మంది, వాంకిడిలో ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉందని తెలిపారు. జిల్లా ట్రెజరీ అధికారులు ఒంటరి పెన్షనర్ల నామినీ పేర్లు పీపీవోలో పొందుపర్చాలని, పింఛన్ బిల్లులు 15లోగా పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ డీఆర్‌లు మంజూరు చేయాలన్నారు. డెత్, డిపెండెంట్ సర్టిఫికెట్లు సంబంధిత అధికారులు సకాలంలో జారీ చేయాలన్నారు. సమావేశంలో ప్రతినిధులు సదానందం, రమేశ్, రామస్వామి, కిష్టయ్య, సిరాజ్ ఉల్ హక్, సిడాం సూరు, అమలా మేరి, గౌరమ్మ, కనకమ్మ, మధుసూదన్‌గౌడ్ పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



టీషర్ట్స్ అందజేస్తున్న జిల్లా యువజన క్రీడల అధికారి మణెమ్మ

ఆసిఫాబాద్: వేసవి క్రీడా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి మణెమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో క్రీడా శిబిరాలకు అవసరమైన క్రీడాసామగ్రిని బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి 31 వరకు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో 10 అంశాలపై వివిధ మండలాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చిన 10 మంది శిక్షకులను అభినందించారు. వారికి క్రీడాసామగ్రి, టీషర్ట్స్ అందజేశారు. ఏటీడీవో క్షేత్రయ్య, క్రీడాపాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణారావు, కోచ్ విద్యాసాగర్, పీఈటీ రాకేశ్, బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ శేఖర్, పీడీ తిరుపతి పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి



డీఐఈవో శ్రీధర్ సుమన్‌తో అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: రెగ్యులరైజ్ అయిన అధ్యాపకులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని డీఐఈవో శ్రీధర్‌సుమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో పలువురు అధ్యాపకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ ప్రభుత్వ జీవోతో జిల్లాలో 97 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు రెగ్యులరైజ్ అయ్యారని తెలిపారు. జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 95 మంది జనరల్, ఇద్దరు ఒకేషనల్ కోర్సు బోధిస్తున్న అధ్యాపకులను క్రమబద్ధీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీహరి, సత్యనారాయణ, బాలకిషన్ తదితరులు ఉన్నారు.



సంబాల శివారులో ఈదురు గాలులకు రాలిన మామిడి కాయలు

కోలుకోలేని దెబ్బ!

- అకాల వర్షాలతో నిండా మునిగిన మామిడి రైతులు
- జిల్లాలో 307 ఎకరాల్లో దెబ్బతిన్న తోటలు
- ప్రతికూల వాతావరణంతో పూర్తిగా తగ్గిన దిగుబడి

రెబ్బెన(ఆసిఫాబాద్): ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచే ఏర్పడిన ప్రతికూల పరిస్థితులు మామిడి రైతులను నిండా ముంచాయి. ఆలస్యంగా వచ్చిన పూతలు దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపగా ఆరకొర వచ్చిన కాయలు అకాల వర్షాలు, ఈదురు గాలులతో నేలరాలాయి. ఈదురు గాలులకు రాలిన కాయలకు మార్కెట్‌లో ధర లేక రైతులు తీవ్రంగా నష్టాలను చవిచూస్తున్నారు. చెట్లపై మిగిలిన కాయలు కోసేందుకు కూడా వాతావరణం అనుకూలించకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు రాలుతున్న కాయలను ఏరేందుకు కూడా సమయం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో వందల ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతింటున్నా కనీసం బీమాకు కూడా నోచుకోని పరిస్థితి.

సీజన్ ప్రారంభం నుంచే..

మూడేళ్లుగా మామిడి తోటలు సాగుచేస్తున్న రైతులు కాలం కలిసిరావడం లేదు. కరోనా ప్రభావంతో కాయలకు డిమాండ్ లేక తీవ్ర నష్టపోయారు. మూడేళ్లుగా వస్తున్న నష్టాలను ఈసారైనా భర్తీ చేసుకోవాలని కొండంత ఆశపడిన వారికి నిరాశే మిగిలింది. ఏటా జనవరిలో రావాల్సిన మామిడి పూతలు ప్రతికూల వాతావరణంతో నెల రోజులు ఆలస్యంగా వచ్చాయి. అనంతరం పూతలు ఎండిపోయి పిందెలు తగ్గాయి. అందులోనూ మార్చిలో ఈదురు గాలులతో తోటల్లో 30 శాతం రాలిపోయాయి. అయినా మిగిలిన కాయలను కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించారు. అయినా కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలు, బలమైన గాలుల ధాటికి మామిడి కాయలన్నీ నేలరాలిపోయాయి. రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి), జైనూర్ మండలాల పరిధిలో 905.16 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. అకాల వర్షాలతో దాదాపు 307 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నట్లు ఉద్యానవన శాఖ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదించారు.

దిగుబడి లేక నష్టాల్లోకి..

జిల్లాలో 906 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా, అందులో 90 శాతం తోటలను రైతులు కౌలుకు తీసుకుంటారు. సీజన్ ప్రారంభానికి ముందే కౌలు ఒప్పందం చేసుకుంటారు. కొన్నేళ్లుగా వాతావరణం అనుకూలించకపోవడంతో మామిడి రైతులు పెట్టుబడులు సైతం రాబట్టుకోలేని పరిస్థితుల్లో ఉన్నారు. విరగబూసిన పూతలను చూసి మురిసిపోయే లోపే ప్రతికూల వాతావరణం వారి ఆశలపై నీళ్లు చల్లింది. పరిస్థితులు అనుకూలిస్తే ఎకరానికి సుమారు 8 టన్నుల దిగుబడి వచ్చేది. ఈసారి 2, 3 టన్నులకు మించి రాలేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

రాలిన కాయలకు ధర అంతంతే..!

జిల్లాలోని మామిడి తోటలన్నీ ప్రస్తుతం కోత దశలో ఉన్నాయి. ప్రతిరోజూ సాయంత్రం పూట వీస్తున్న ఈదురు గాలులతో కాయలు కోయలేని పరిస్థితి. రాలిన కాయలు సేకరించడంతోనే సరిపోతోంది. రాలిన కాయలకు మార్కెట్‌లో పెద్దగా ధర లేకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. నాణ్యమైన కాయలకు టన్నుకు రూ.26వేల వరకు ధర పలుకుతుండగా రాలిన కాయలను టన్నుకు రూ.10 వేలు కూడా చెల్లించడం లేదు. వాటిని మార్కెట్‌కు తరలిస్తే లోడింగ్ ఖర్చులు, రవాణా ఖర్చులు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.6 లక్షల నష్టం



కొన్నేళ్లుగా మామిడి తోటల్లో లాభం ఉండడం లేదు. దాదాపు 30 ఎకరాల వరకు మామిడి తోటలు పట్టిన. పూతలు తగ్గి కాయలు ఎక్కువగా పడలేదు. ఉన్న కాయలతో పెట్టుబడి వస్తుందని అనుకుంటే వర్షాలు, గాలులకు కాయలన్నీ రాలినయ్. రాలిన కాయలను మార్కెట్‌కు తీసుకెళ్తే కనీసం బండి కిరాయి, లోడింగ్ ఖర్చులు కూడ వస్త లేవు. ఇప్పటి వరకు దాదాపు రూ.6లక్షల వరకు నష్టపోయిన. – మహ్మద్ రైస్, కౌలుదారు

దిగుబడి తగ్గింది



అకాల వర్షాలు, ఈదురు గాలులతో జిల్లా వ్యాప్తంగా 307 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నట్లు గుర్తించాం. గతంలో పోల్చితే ఈసారి నెల ఆలస్యంగా పూతలు రావడంతో వాతావరణ పరిస్థితుల కారణంగా పూతలు ఎండిపోయి దిగుబడి తగ్గింది. – ఎంఏ నదీమ్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

బీఆర్‌ఎస్‌లో తాజా, మాజీల వార్!



ప్రారంభోత్సవం కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం



ధ్వంసమైన శిలాఫలకం

- రాజుకుంటున్న అసమ్మతి
- ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ముదురుతున్న వివాదం
- గంగాపూర్‌లో రెండుగా చీలిన పార్టీ శ్రేణులు

సాక్షి, ఆసిఫాబాద్: మరో ఆరు నెలల్లో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ తాజా, మాజీ ఎమ్మెల్యేల మధ్య ఎన్నికల వార్ మొదలైంది. పార్టీ శ్రేణులు సైతం రెండు వర్గాలుగా విడిపోయి పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల జరిగిన పార్టీ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు కలిసి పనిచేయాలని నిర్ణయించిన పది రోజుల్లోనే బీఆర్‌ఎస్ ముసలం బయటికి రావడం ఆసక్తిగా మారింది. రెబ్బెన మండలం గంగాపూర్ గ్రామంలో శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద నిర్మించిన షెడ్డు నిర్మాణం, రోడ్డు, ఇతర మరమ్మతులను మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ దంపతులు రూ.4 లక్షల సొంత వ్యయంతో చేపట్టారు. ఈ పనులను గురువారం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి దంపతులు ప్రారంభించాల్సిన నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంలో ఎమ్మెల్యే పేరు లేకపోవడం ఇరువర్గాల మధ్య వివాదానికి దారితీసింది. బుధవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు అనుచరులు కొందరు ఆ శిలాఫలకాన్ని తొలగించడంతో గొడవ ప్రారంభమైంది. రానున్న ఎన్నికల నేపథ్యంలోనే ఇరువర్గాల మధ్య అసమ్మతి రాజుకున్నట్లు తెలుస్తోంది.

ఆది నుంచీ..

ఒకే ఒరలో రెండు కత్తులు ఇమడవన్నట్లుగా.. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీలో తాజా, మాజీ ఎమ్మెల్యేల తీరుకు అద్దం పడుతోంది. వారిరువురి మధ్య ఆది నుంచీ కోల్డ్‌వార్ నడుస్తోంది. 2009 ఎన్నికల్లో ఆత్రం సక్కు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందగా.. 2014 ఎన్నికల్లో కోవ లక్ష్మి టీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా ఆత్రం సక్కుపై గెలుపొందింది. తర్వాత 2018 ఎన్నికల్లో కోవ లక్ష్మిపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన ఆత్రం సక్కు స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. అనంతరం ఆత్రం సక్కు టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బీఆర్‌ఎస్) పార్టీలో చేరారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలిచి కోవ లక్ష్మి జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. ఆనాటి నుంచి వీరి మధ్య పొసగడం లేదు. నియోజకవర్గంలో బాగా పట్టున్న కోవ లక్ష్మి ఎమ్మెల్యేతో అంటీముంటన్నట్లుగానే ఉంటూ వస్తున్నారు. పార్టీ కార్యక్రమాల్లో మినహాయిస్తే మిగిలిన అన్ని కార్యక్రమాల్లో వేర్వేరుగా పాల్గొనేవారు. పార్టీ శ్రేణులు సైతం అదే విధంగా గ్రూపులుగా విడిపోయారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో వీరు ప్రత్యర్థి పార్టీ శ్రేణులపై కేసులు సైతం నమోదు చేయించిన ఘటనలు అనేకం ఉన్నాయి.

రానున్న ఎన్నికలపై దృష్టి..

రానున్న ఎన్నికలపై జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుల దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే కోవ లక్ష్మి నియోజకవర్గం అంతా కలియదిరుగుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనుల గురించి చెబుతూ తనకు మరోసారి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతోంది. నిత్యం ఏదో ఒక మండలంలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్నికల కసరత్తు మొదలుపెట్టింది. అదే సమయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు సైతం నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. అయితే ఆయన ఎక్కువగా జిల్లా కేంద్రంలోగాని, హైదరాబాద్‌లోగాని ఉంటుండడంతో శ్రేణుల్లో కొంత అసంతృప్తి నెలకొన్నట్లుగా పార్టీ వర్గాలే చెబుతున్నాయి. గత ఎన్నికల్లో తనను గెలిపించేందుకు కృషి చేసిన వారినందరినీ తర్వాత దూరం పెట్టడం.. కోవ లక్ష్మి వర్గంలో ఉంటూ ప్రస్తుతం ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతున్న వర్గానికే అధిక ప్రాధాన్యం ఇవ్వడంపైనా లోలోన భగ్గుమంటున్నాయి. ఈ పరిణామాలన్నీ వచ్చే ఎన్నికల నాటికి ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని ఆయా వర్గాలు పేర్కొంటున్నాయి.

టిక్కెట్టు కోసం పైరవీలు..

తాజా, మాజీలు ఇద్దరూ టిక్కెట్టు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కోవ లక్ష్మి బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను తరచూ కలుస్తూ ఎమ్మెల్యే బెర్త్ ఖాయం చేసుకునేందుకు తనవంతు కృషి చేస్తోందని ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. కేటీఆర్ ఆశీస్సులు ఉన్నట్లు వారు బాహాటంగానే పేర్కొంటుండటం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అయితే మరోవైపు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు సైతం చాపకింద నీరులా తన ప్రయత్నాలు మొదలెట్టారని తెలుస్తోంది. ఇప్పటికే ఆయన మద్దతు ఇచ్చే నేతలను కూడగట్టి పార్టీ పెద్దలను కలుస్తున్నారు. ఇటీవల కేటీఆర్‌ను సైతం ఆత్రం మద్దతుదారులు కలిసి అతని టిక్కెట్టు విషయమై చర్చించినట్లు తెలుస్తోంది. టిక్కెట్టు విషయం అధిష్టానం చూసుకుంటుందని, తన చేతుల్లో ఏమీ లేదని కేటీఆర్ వారి వద్ద స్పష్టం చేసినట్లు వినికిడి. అయితే టిక్కెట్టు ఎవరికి దక్కుతుందో చివరి నిమిషం వరకూ వేచిచూడాల్సిందే.

జేపీఎస్‌ల సమ్మెకు సర్పంచుల మద్దతు



వినతిపత్రం అందిస్తున్న సర్పంచులు, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. బుధవారం జేపీఎస్‌ల సమ్మెకు జిల్లా సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. అనంతరం పలువురు సర్పంచులు జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుణవంత్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జేపీఎస్‌ల డిమాండ్లు నెరవేర్చాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి పాటుపడుతున్న జూనియర్ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. సమ్మెతో పంచాయతీల్లో పనులకు ఆటంకం కలుగుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, జేపీఎస్‌లు కృష్ణ, గణేశ్, మహేశ్, రవి, సాయి, రమేశ్, కుమార్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- లగ్గాం గ్రామంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, అధికారులు

దహెగాం(సిర్పూర్): రైతులు పండించిన పంటలకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో అకాల వర్షాలతో ఆరబెట్టిన ధాన్యం తడిసి మొలకెత్తుతుందని మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'నిండా ముంచింది' అనే కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని లగ్గాం గ్రామంలో కలెక్టర్.. అదనపు కలెక్టర్ రాజేశం, డీసీవో తారామణితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడొద్దన్నారు. జిల్లా వ్యాప్తంగా 30 కొనుగోలు కేంద్రాల్లో యాసంగిలో 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కలెక్టర్‌ను రైస్ మిల్లుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిలువేరు సత్యనారాయణ, పలువురు రైతులు సన్మానించారు. కార్యక్రమంలో డీఎం గోపాల్, డీసీఏవో మాహమూద్, ఏడీఏ రాజులనాయుడు, తహసీల్దార్ ప్రహ్లాద్, ఏఎంసీ సెక్రెటరీ భాస్కర్, ఏవో వంశీకృష్ణ, సీఈవో బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు జాగ్రత్తలు పాటించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

ఆసిఫాబాద్: విద్యుత్ కార్మికులు జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో సబ్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ అన్నారు. విద్యుత్ వారోత్సవాల పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని సెక్షన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పనిచేసే స్థలాల్లో ఎర్త్ రాడ్లు తప్పనిసరిగా వాడాలన్నారు. వినియోగదారులు తీగలు తెగిపడిన సమయంలో సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ ఫిరోజ్ ఖాన్, సబ్ ఇంజనీర్ శేఖర్, లైన్ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: డివిజన్ వ్యాప్తంగా ఈనెల 7 వరకు విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ డివిజనల్ ఇంజనీర్ రాజశేఖర్‌రావు అన్నారు. విద్యుత్ డివిజన్ కార్యాలయంలో బుధవారం వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. బట్టలు ఆరవేస్తున్న సమయంలో విద్యుత్ తీగలకు దూరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్, ఏఈలు జగన్మోహన్, రవీందర్, కమలాకర్, సబ్ ఇంజనీర్లు శ్రీనివాస్, అఖిల్, శరత్, సిబ్బంది పాల్గొన్నారు.

విభజన కొలిక్కి!

- కొత్త జిల్లాల వారీగా జెడ్పీ జీపీఎఫ్ వివరాలు
- సిద్ధమైన ఉద్యోగులు, ఖాతాల జాబితా
- ట్రెజరీల ద్వారా ఆయా జెడ్పీలకు త్వరలోనే మార్పు
- తీరనున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల వెతలు

ఉమ్మడి జిల్లా వారీగా జెడ్పీ పరిధిలోని ఉద్యోగులు, వారి జీపీఎఫ్ సొమ్ము వివరాలు

జిల్లా	ఉద్యోగుల సంఖ్య	జీపీఎఫ్ సొమ్ము
ఆదిలాబాద్	1,908	రూ.90 కోట్లు
నిర్మల్	1,579	రూ.50 కోట్లు
మంచిర్యాల	1,506	రూ.50 కోట్లు
కుమురంభీం	591	రూ.30 కోట్లు



ఆదిలాబాద్ జిల్లా పరిషత్ కార్యాలయం

కైలాస్‌నగర్: ఇప్పటి వరకు ఆదిలాబాద్ కేంద్రంగా సాగుతున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ జీపీఎఫ్ (సాధారణ భవిష్య నిధి) పునర్విభజనకు ఎట్టకేలకు రంగం సిద్ధమైంది. జెడ్పీల పునర్విభజన జరిగిన ఐదేళ్ల తర్వాత ప్రభుత్వం దీనిపై దృష్టి సారించింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి గత నెల 28న ఆదేశాలు జారీ అయ్యాయి. తదనుగుణంగా జెడ్పీ అధికారులు జిల్లాల వారీగా ఉద్యోగులు, వారి జీపీఎఫ్ సొమ్ము, వడ్డీ వంటి సమగ్ర సమాచారాన్ని పునర్విభజన చేస్తున్నారు. వారం రోజులుగా చేపట్టిన ఈ ప్రక్రియ తుది దశకు చేరింది. రెండు, మూడు రోజుల్లో జీపీఎఫ్ వ్యవహారాలన్నీ ఆయా జిల్లాల జెడ్పీ పరిధిలోకి మారనున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. దీంతో ఇక జీపీఎఫ్ సొమ్ము కోసం మంచిర్యాల, కుమురంభీం, నిర్మల్ జిల్లాల ఉద్యోగ, ఉపాధ్యాయుల అవస్థలు దూరం కానున్నాయి. వారి సొంత జిల్లాలోనే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

ఐదేళ్లుగా అవస్థలు

జిల్లా పరిషత్ ఆధీనంలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సదుపాయం ఉంటుంది. ఇలా దాచుకున్న మొత్తాన్ని తమ పిల్లల వివాహాలు, చదువులు, గృహ నిర్మాణాలు, కుటుంబసభ్యుల ఆరోగ్య సమస్యలకు వినియోగించుకుంటారు. ఈ సొమ్ముకు ప్రభుత్వం వడ్డీ సైతం జమచేస్తోంది. అలాగే వారి అవసరాలకు అందజేస్తుంటుంది. ఇందుకు జెడ్పీలో జీపీఎఫ్ ప్రత్యేక విభాగం పనిచేస్తోంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పాలన సౌలభ్యం నిమిత్తం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్‌ను నాలుగు జిల్లాలుగా 2019 జూలై 5న పునర్విభజించింది. అప్పటి నుంచి కొత్తగా ఏర్పడ్డ, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లా పరిషత్‌ల్లో పాలన నడుస్తున్నా జీపీఎఫ్ వ్యవహారాలు మాత్రం ఇప్పటికీ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగానే సాగుతున్నాయి. దీంతో వాటి కోసం ఈ మూడు జిల్లాల్లోని దూర ప్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులు ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కుమురంభీం జిల్లాలోని బెజ్జూర్, కెరమెరితో పాటు మంచిర్యాల జిల్లాలోని వేమనపల్లి, చెన్నూర్ వంటి ప్రాంతాల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆదిలాబాద్‌కు వచ్చి వెళ్లాలంటే రెండు రోజులు కేటాయించాల్సిందే.

తుదిదశకు కసరత్తు

అవసర నిమిత్తం దాచుకున్న సొమ్ము కోసం జీపీఎఫ్‌కు దరఖాస్తు చేసుకుని దాన్ని అందజేయాలంటే ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వచ్చేది. ఈ క్రమంలో స్థానికంగానే జీపీఎఫ్‌ను నిర్వహించాలంటూ కొన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు సైతం చేపట్టారు. వీటిని గమనించిన రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు జీపీఎఫ్‌ను పునర్విభజన చేయాలని నిర్ణయిస్తూ ఆదేశాలు జారీచేసింది. వాటి కనుగుణంగా జెడ్పీ అధికారులు గత నెల 28నుంచి కసరత్తు చేపట్టారు. ఒక్కో జెడ్పీ నుంచి సూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టు ఇలా నలుగురు చొప్పున నాలుగు జిల్లాల నుంచి 16మంది జీపీఎఫ్ వివరాల పునర్విభజనలో నిమగ్నమయ్యారు. జిల్లాల వారీగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారు దాచుకున్న సొమ్ము, రావాల్సిన వడ్డీ, బ్యాంకు ఖాతాల నంబర్లు తదితర వివరాల జాబితాలను సిద్ధం చేశారు. ఈ వివరాలను ట్రెజరీల ద్వారా ఆయా జెడ్పీలకు పంపనున్నారు. ఈ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి కానుందని అధికారులు చెబుతున్నారు.

14 ఏళ్లుగా జాడలేని వడ్డీ

ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్‌కు సంబంధించి వారు దాచుకున్న సొమ్ముకు ప్రభుత్వం వడ్డీ చెల్లిస్తోంది. అయితే 2009 నుంచి ప్రభుత్వం దీనికి వడ్డీ చెల్లించడం లేదు. ఒక్కో నెల ఉమ్మడి జిల్లాలో జీపీఎఫ్ సొమ్ము రూ.5కోట్లు జమ అవుతుందని ఈ లెక్కన గత 14 ఏళ్లలో రూ.225 కోట్ల వడ్డీ ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నట్లుగా జెడ్పీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రూ.200.20 కోట్లను నాలుగు జిల్లాలకు విభజన చేస్తున్నట్లుగా తెలిపారు. ఆయా జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సంఖ్యకనుగుణంగా ఈ నిధులను పంపిణీ చేయనున్నట్లుగా చెబుతున్నారు. వడ్డీ నిధులు విడుదలయ్యాక వాటిని సైతం జిల్లాల వారీగా అందజేస్తామని పేర్కొంటున్నారు.

విభజన ప్రక్రియ తుదిదశకు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ వివరాల పునర్విభజన ప్రక్రియ తుది దశకు చేరింది. జిల్లాల వారీగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, వారికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేశాం. వీటిని రెండు రోజుల్లో ట్రెజరీల ద్వారా ఆయా జెడ్పీలకు పంపుతాం. ఆ వెంటనే ఆయా జిల్లాల వారీగా జీపీఎఫ్ వ్యవహారాలు కొనసాగుతాయి. ఇక ఉద్యోగులు సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికి రావాల్సిన అవసరం ఉండదు. – వి.గణపతి, జెడ్పీ సీఈవో, ఆదిలాబాద్

క్లుప్తంగా

కాపర్ దొంగలపై పీడీయాక్ట్



పీడీయాక్ట్ పత్రాలు అందిస్తున్న పోలీసులు

జైపూర్(చెన్నూర్): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు దొంగిలించిన ఏడుగురు నిందితులపై బుధవారం పీడీయాక్ట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ రెమా రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన మద్దిపల్లి సాయితేజ , దోనిపల్లి సురేశ్, మీనుగు మల్లేశ్, రేగుంట వర్ధన్, చిప్పకుర్తి రాకేశ్, పులి భరద్వాజ్, మినుగు భానేశ్‌లకు మంథని సీఐ సతీష్ కరీంనగర్ జిల్లా జైలులో పత్రాలు అందజేశారు. అనంతరం నిందితులను చర్లపల్లి జైలుకు తరలించారు. వారిపై గతంలో మంథని, జైపూర్, భీమారం, కోటపల్లి, దండేపల్లి, కాటారం, కాళేశ్వరం, గోదావరిఖని టూటౌన్, అంతర్గాం, బసంత్‌నగర్, ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 41 కేసులు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

గంజాయి స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని తనిఖీ చేయగా వారి వద్ద 600 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. జమ్మికుంటకు చెందిన మహ్మద్ అమీర్, వంతడపుల వికాస్ మంచిర్యాలకు చెందిన రియాజ్ వద్ద నుంచి గంజాయిని విక్రయించినట్లు తెలిపారు. అమీర్, వికాస్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని, రియాజ్ పరారీలో ఉన్నడాని ఎస్సై తెలిపారు.

గంజాయి మొక్కలు స్వాధీనం

బోథ్: మండలంలోని సొనాల శివారులో ఓ చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను సీఐ కిరణ్ కుమార్, ఎస్సై రవీందర్ బుధవారం పట్టుకున్నారు.అత్రం శ్రీకాంత్ అనే వ్యక్తి చేను కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంట వేశాడు. పంటలో అక్కడక్కడా గంజాయి మొక్కలు సాగు చేశాడు. 17 మొక్కలను గుర్తించి కాల్చివేసినట్లు తెలిపారు.లించగా 17 గంజాయి మొక్కలు లభించాయి.

బైక్ అదుపుతప్పి డ్రైవర్‌కు తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో నరేష్

రెబ్బెన(ఆసిఫాబాద్): రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఐబీ తాండూర్‌కు చెందిన నరేష్ లారీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకున్న నరేష్ ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్ నుంచి ఐబీ తాండూర్‌కు బయలుదేరాడు. కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వద్దకు చేరుకోగానే బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. 108లో బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, లబ్ధిదారుల వివరాలు

జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు	రేషన్ బియ్యం
మంచిర్యాల	969	4,701	3,942	39,760	59,150 కిలోలు
నిర్మల్	926	5,809	6,405	61,298	414 మెట్రిక్ టన్నులు
కుమురంభీం	973	4,858	5,227	44,417	53,588 కిలోలు
ఆదిలాబాద్	1,256	3,776	4,205	49,568	70 టన్నులు



'అంగన్‌వాడీ'లకు సన్నబియ్యం

- చిన్నారులు, గర్భిణులకు ఉపయోగం
- దొడ్డు బియ్యంతో భోజనం చేసేందుకు అనాసక్తి

మంచిర్యాలటౌన్: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందించేందుకు ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలకు ఇన్నాళ్లు పోషకాలతో కూడిన దొడ్డు బియ్యం అందిస్తున్న ప్రభుత్వం ఇకపై బలవర్ధక సన్న బియ్యం అందించాలని నిర్ణయించింది. నూతన సచివాలయం ప్రారంభం రోజునే గిరిజన మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సంపూర్ణ ఆహార పథకం ఫైల్‌పై సంతకం చేశారు. అన్ని రకాల పోషకాలు కలిగిన బియ్యంతోనే ఇన్నాళ్లు అంగన్‌వాడీకి వచ్చే వారికి మధ్యాహ్నం భోజనం పెడుతున్నారు. ఈ బియ్యం దొడ్డుగా ఉండడంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలు తినేందుకు అంతగా ఆసక్తిని చూపించడం లేదు. కొందరు మాత్రమే భోజనాలు చేస్తుండడంతో, సన్న బియ్యంతో భోజనం పెట్టాలని లబ్ధిదారుల నుంచి చాలా కాలంగా డిమాండ్ ఉంది. సన్నబియ్యంలో కంటే దొడ్డు బియ్యంలోనే పోషకాలు ఉండడంతో ఇన్నాళ్లు వాటినే ఇస్తున్నారు. సన్నబియ్యంలోనూ అన్ని రకాల పోషకాలు అందేలా చేసి వాటిని రేషన్ దుకాణాల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయనున్నారు. పూర్తిస్థాయిలో ఉత్తర్వులు వెలువడితే ఈ నెలలోనే సన్నబియ్యం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే అవకాశం ఉంది. ఉత్తర్వులు ఆలస్యమైతే వచ్చే నెల నుంచి సన్నబియ్యంతో కూడిన భోజనాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అవకాశం ఉంది.



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులు(ఫైల్)

ఉత్తర్వులు రాగానే సన్నబియ్యం అందజేస్తాం



అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం పంపిణీకి సంబంధించిన ఉత్తర్వులు రాగానే అందిస్తాం. ప్రస్తుతం పోషకాలతో కూడిన దొడ్డు బియ్యం రేషన్ షాపుల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తుండగా సన్నబియ్యం వస్తే అదే క్వాంటిటీతో సన్నబియ్యం అందించడం జరుగుతుంది. పోషకాహార లోపం అధిగమించేందుకు లబ్ధిదారులందరికీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ఆహారం తప్పనిసరిగా తీసుకునేలా చూస్తాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమశాఖ అధికారి, మంచిర్యాల

పోషకాహారం అందితేనే..

అంగన్‌వాడీ కేంద్రాల ముఖ్య ఉద్దేశం ప్రతి ఒక్కరికీ అవసరమైన పౌష్టికాహారం అందించడమే. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పుట్టబోయే చిన్నారుల నుంచి ఆరేళ్ల వయస్సు వరకు తల్లి, బిడ్డ ఇద్దరికీ పౌష్టికాహారం అందించి, చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చేయాలన్న ఉద్దేశం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుబాటులోని పౌష్టికాహారం అందిస్తున్న పూర్తిస్థాయిలో పౌష్టికాహారం అందక చిన్నారులు పౌష్టికాహార లోపంతో బలహీనంగా మారుతున్నారు. బలవర్ధక ఆహారం అందించేందుకు కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నా, పలువురు చిన్నారులు ఎత్తుకు తగిన బరువు లేకపోవడం, బరువుకు తగిన ఎత్తు లేకపోవడం, వయస్సుకు తగిన బ రువు, తీవ్ర పోషక లోపంతో బాధపడుతున్న వారి సంఖ్య మాత్రం జిల్లాలో తగ్గడం లేదు. దీనికి ము ఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పప్పు, పాలు, కోడిగుడ్లతో పాటు, సన్నబియ్యం సక్రమంగా అందిస్తేనే పోషకాహార లోపం అధిగమించేందుకు అవకాశం ఉంటుంది. కూరగాయలు, ఆకుకూరలు, పప్పు, ఉడికించిన కోడిగుడ్డుతో భోజనం అందించడంతో పాటు, పాలు అందిస్తున్నారు. కోడిగుడ్లు చిన్నవిగా వస్తున్నాయని పలు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. అన్నీ అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకే రకమైన కోడిగుడ్లను పంపిణీ చేసేలా చర్యలను తీసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం పౌష్టికాహారం అందించడంపై దృష్టి పెట్టడడంతో పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

రామకృష్ణాపూర్(చెన్నూర్): రవీంద్రఖని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపారు. పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ ఏరియాకు చెందిన గాదె తిరుపతి(46) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఉండటంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

సింగరేణి పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణరావు తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి గానూ ఇంగ్లిష్ మీడియంలో 1 నుంచి 9వ తరగతి వరకు, తెలుగు మీడియంలో ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆయన పేర్కొన్నారు. ఏరియాలోని సింగరేణి కార్మికులు, కార్మికేతరులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం సింగరేణి పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు.

ప్రమాదవశాత్తు రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి

కాగజ్‌నగర్‌టౌన్: ప్రమాదవశాత్తు రైలులోంచి కిందపడి ఒకరు మృతి చెందినట్లు కాగజ్‌నగర్ జీఆర్‌పీ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ పరిధిలోని వంజిరి రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి చెన్నై నుంచి గయా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులోంచి అనిల్ కుమార్ బర్తియా (35) ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతుడు ఏపీలోని వినుకొండలో గల ఓ బైక్ షోరూంలో పనిచేస్తున్నాడు. యూపీలోని తన అన్నయ్య కూతురు వివాహానికి చెన్నై రైల్వేస్టేషన్‌లో గయా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోకి రాగానే కిందపడడతో తీవ్రగాయాలై మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం సిర్పూర్(టి) సివిల్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఆదివాసీలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గిరిజనులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఉట్నూర్ ఐటీడీఏ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో ఐటీడీఏ ద్వారా చేపడుతున్న పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ఐటీడీఏ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన మరుగుదొడ్లు, భోజనశాల, ప్రహరీ, స్నానం, అదనపు తరగతి గదులు, ఇతరత్రా పనులను వెంటనే పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బర్త్ వెయిటింగ్ హాళ్లు, అంగన్‌వాడీ భవనాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఏజెన్సీ పరిధిలో ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత నియంత్రించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఆదర్శ గ్రామయోజన పథకం కింద ఎంపిక చేసిన 24 గిరిజన గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శ గ్రామాలుగా మార్చే దిశగా తీర్చిదిద్దాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాలు, తండా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించే దిశగా రూ.153 కోట్ల నిధులతో 122 బీటీ రోడ్లను మంజూరు చేసిందన్నారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేలా వృత్తి నైపుణ్య శిక్షణలను అందించాలని సూచించారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డెప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, ఏపీవో భీంరావు, ఆర్డీవో సురేశ్, ఈఈ రాథోడ్ భీంరావు, అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి కుమురం బాలు, ఏపీవో పీవీటీజీ భాస్కర్, ఓఎస్డీ కృష్ణయ్య, ఏవో రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



వాహనాలను ప్రారంభిస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్: వైద్యా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం గిరిజన ఆరోగ్యాన్ని సంరక్షించుటలో భాగంగా ఐటీడీఏ ఉట్నూర్‌కు ఐదు ఆరోగ్య సంరక్షణ బృందాలను (మెడికల్ టీమ్స్) మంజూరు చేయడం జరిగిందని, రెండు బృందాలు ఆదిలాబాద్ జిల్లాకు, రెండు బృందాలు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు, ఒక బృందం మంచిర్యాల జిల్లాకు కేటాయించడం జరిగిందన్నారు. ఈ బృందంలో ఒక వైద్యాధికారి, ఒక స్టాఫ్ నర్సు, మందులతో కూడిన వాహనం ఉంటుందన్నారు. బృందాలు మారుమూల గిరి ప్రాంతాలకు వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి చికిత్స చేయాలని, హైరిస్క్ కేసులను గుర్తించి తగు సూచనలు, చికిత్స చేయడం, క్షయవ్యాధి, కుష్ఠువ్యాధి, విరేచనాలతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. మధుమేహం, రక్తపోటు, కంటి వ్యాధులను గుర్తించి చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కుమురం బాలు, ఏపీవో భీంరావు, వైద్యాధికారిణి అనికేత, వైద్యాధికారి కార్తీక్, ప్రొగ్రాం మేనేజర్ జైవంత్‌రావు, సూపర్‌వైజర్ కుమ్ర శిరీష్‌కుమార్ పాల్గొన్నారు.

1ఏ గనిపై మస్టర్ పడే అవకాశం కల్పించాలి

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాలో నూతనంగా ప్రారంభించిన కాసిపేట–1ఏ గనిపైనే మస్టర్ పడే అవకాశం కల్పించాలని కోరుతూ ఐఎన్టీయూసీ నాయకులు బుధవారం ఏరియా జనరల్ మేనేజర్ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాసిపేట–1 గని కార్మికులే 1ఏలో విధులు నిర్వహిస్తున్నారని, అక్కడకు వెళ్లడానికి ఐదారు కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. 1గని పైనే మస్టర్ పడిన కార్మికులను 1ఏకు పంపిణీ చేసి విధులకు పంపిస్తున్నారని, మార్గమధ్యలో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు దేవి భూమయ్య, రాంశెట్టి నరేందర్, చంద్రశేఖర్, రాములు, యాదగిరి, పరమేశ్, రాజేంద్రప్రసాద్, స్వామి, రమేశ్, శివ ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్టీయూసీ నాయకులు

రేపటి నుంచి వేసవి క్రీడాశిక్షణ

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని సింగరేణి ఉద్యోగుల పిల్లలకు శుక్రవారం నుంచి గోలేటి భీమన్న స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభిస్తున్నామని బీపీఏ జనరల్ మేనేజర్ దేవేందర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లలోపు చిన్నారులకు వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ క్రీడల్లో 25 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, క్రీడాకారులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా శిక్షణ శిబిరం ద్వారా క్రీడలపై పట్టు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు కొనసాగే శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న సింగరేణి సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రాతినిథ్యం వహించిన క్రీడాకారులు గురువారం సాయంత్రం 5 గంటలలోగా జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో సంప్రదించాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏరియా జీఎం దేవేందర్

ఏఈ పోస్టులకు అనుమతించాలని వినతి

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో ఇంటర్నల్ అసిస్టెంట్ ఇంజినీర్ పోస్టులకు తమకు అనుమతివ్వాలని కోరుతూ అంతర్గత అభ్యర్థులు బుధవారం కొత్తగూడెంలో సింగరేణి డైరెక్టర్(పా, ఫైనాన్స్) ఎన్.బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తామంతా జేఎన్టీయూలో డిస్టెన్స్ బీటెక్ చేశామన్నారు. మార్చిలో వెలువడిన ఇంటర్నల్ ఇంజినీర్‌పోస్టులకు దరఖాస్తు చేసుకున్నామన్నారు. డిస్టెన్స్ కోర్సు చేసిన వారిని పరీక్షకు అనుమతించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. తాము బీటెక్ చేసేటప్పుడు కంపెనీ ఎన్వోసీ కూడా ఇచ్చిందని గుర్తు చేశారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన జేఎన్టీయూలో డిస్టెన్స్ బీటెక్ కోర్సును కంపెనీ గుర్తించాలని, అంతర్గత అభ్యర్థులైన తమకు ఫీల్డ్ పరంగా కూడా అనుభవం ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యేలా హాల్‌టికెట్లు ఇవ్వాలని కోరారు. దీనిపై డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి లక్కీడ్రా



లక్కీడ్రా నిర్వహిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి బుధవారం లక్కీడ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేసినట్లు డీడీ దిలీప్‌కుమార్ తెలిపారు. డ్రాలో ఎర్మా సూర్యభాన్, హెరకుమ్ర రిత్విక్‌ధన్‌రాజ్, జుగ్నక్ హరిచైతన్య, రాథోడ్ చందర్, సెడ్మకి సహస్ర ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అదనపు కలెక్టర్ పర్యటన

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట, నాగసముద్రం , మాకులపేట గ్రామాల్లో అదనపు కలెక్టర్ రాహుల్ బుధవారం పర్యటించారు. తాళ్లపేటలో నిరుపయోగంగా ఉన్న జీసీసీ గోదాం భవనాన్ని పరిశీలించారు. దానికి మరమ్మతులు చేయించి, గ్రంథాలయం ఏర్పాటు చేయన్నుట్లు తెలిపారు. మరమ్మతులకు సంబంధించిన నివేదికలు తయారు చేయాలని పీఆర్ఏఈ విక్రమ్‌ను ఆదేశించారు. అక్కడి నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023లో ఎంపికయిన నాగసముద్రం గ్రామాన్ని సందర్శించారు. గ్రామాన్ని స్వచ్ఛంగా గ్రామంగా తీర్చి దిద్దాలని, సూచించారు. దీనిపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ప్రతీ ఇంటికి మరగుదొడ్డి, ఇంకుడు గుంతలు తప్పక ఉండాలన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మాకులపేటలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం దండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మనఊరు–మనబడి కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. బడులు తెరిచేలోగా పనులన్నీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో మల్లేశం, ఎంఈవో రవీందర్, సర్పంచ్ ప్రేమల, ఉపసర్పంచ్ తిరుపతి, ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో దుర్గదాస్, సీసీ లావణ్య, సీఆర్పీ నర్సయ్య, హెచ్ఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

గుండెపోటుతో మిషన్‌భగీరథ ఈఈ మృతి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్ ఈఈ నాగేశ్వర్ రావు (49) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఖమ్మంకు చెందిన నాగేశ్వర్‌రావు జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తూ మంచిర్యాలలో నివాసం ఉంటున్నాడు. బుధవారం మండలంలోని మానిక్‌గూడ పంప్‌హౌజ్ వద్ద విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇంటికి వెళ్లిపోయారు. సాయంత్రం గుండెపోటు రావడంతో ఇంట్లో కుప్పకూలిపోయారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.